పనులు 5 గోతులు 3 కిలోమీటర్లు

వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం



చందానగర్‌లో పైప్‌లైన్ పనులు చేసిన చోట భారీ గుంతలు

హఫీజ్‌పేట్: చందానగర్ నుంచి హఫీజ్ పేట్ వరకు మంజీరా నూతన పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తి చేసిన చోట రోడ్లు గుంతలు పడ్డాయి. దీంతో ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. సుమారు రూ.40 కోట్లతో 5 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేస్తున్నారు. ఇప్పటి వరకు 3 కిలోమీటర్ల మేర మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. అయితే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గుంతల్లో వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. ఇక చిన్నపాటి వర్షానికి రోడ్డు చిత్తడిగా మారడంతో వాహనదారులు జారిపడుతున్నారు. భారీ వర్షం కురిసినప్పుడు పైప్‌లైన్ వేసిన చోట ఎక్కడ ఏ గుంత ఉందో తెలియడం లేదని వాహనదారులు వాపోతున్నారు. చందానగర్ గంగారం వద్ద భారీగా గుంతలు ఏర్పడ్డాయి. గత నాలుగు నెలల నుంచి ఆ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంజీరా రోడ్డులో వేలాది వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి.ఒక్కోచోట ఒక వాహనం వస్తే మరో వాహనం పక్కన ఆగాల్సిందే.పైప్‌లైన్ పనులు పూర్తి కావడానికి ఎన్నాళ్లుపడుతుందో అని స్థానికులు వాపోతున్నారు.

- పైప్‌లైన్ పూర్తి అయిన 3 కిలోమీటర్ల రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
- పనులు జరిగే చోట సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు రాత్రి సమయాలలో వీధి దీపాలు వెలిగేలా చూడాలి
- వర్షాకాలం దృష్ట్యా పైప్‌లైన్ పూర్తి చేసిన చోట జాగ్రత్తలు తీసుకోవాలి
- గంగారం వద్ద ఏర్పడ్డ భారీ గుంతలను పూడ్చి వేయాలి
- రోడ్డుకు ఇరువైపులా నో పార్కింగ్ బోర్డులు ఉంచాలి
- మంజీరా రోడ్డు నూతన పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలి.




గుంతలరోడ్లతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రోడ్డుపైకి రావాలంటే భయమవుతుంది..



చందానగర్‌లో చేపట్టిన నూతన పైప్‌లైన్ పనులతో భారీగా ఏర్పడ్డ గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనం తీసుకొని రోడ్డుపైకి రావాలంటే ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నా. ఇప్పటికైన అధికారులు గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– మదనచారి, వాహనదారుడు

వర్షాకాలం వస్తోంది



పైప్‌లైన్ పనులు పూర్తి అయిన చోట గుంతలు ఏర్పడ్డాయి. చినుకు పడితే రోడ్డు చిత్తడిగా మారుతోంది. రానున్నది వర్షాకాలం. భారీ వర్షాలు పడుతాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. అధికారులు స్పందించాలి.

– అశోక్, వాహనదారుడు

తాగునీరు వృథాగా పోతూ.. మురుగు రోడ్లపై పారుతూ..



రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రోడ్డుపై వాల్వ్ లీకేజీతో రోడ్డుపై పారుతున్న తాగునీరు



రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రహదారిలో రోడ్డుపై ఏరులై పారుతున్న మురుగు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రహదారిలోని పీజేఆర్ విగ్రహం వద్ద తాగునీటి పైపులైన్ వాల్వ్ లీకైవిలువైన తాగునీరు వృథాగా పోతోంది. దానికి తోడు మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగిపొర్లుతోంది. దీంతో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంచినీటి వాల్వ్ లీకేజీని అరికట్టి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగిపొర్లకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పరామర్శ



మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఆరోగ్య సమస్యతో వివేకానందనగర్‌లోని మన ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. సోమవారం విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఆస్పత్రికి వచ్చి మధుసూదన్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన త్వరలో కోలుకుంటారని ఆయన కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ఆర్. కార్తిక్‌రావు, సూర్యనారాయణ, శ్రీధర్‌ప్రసాద్, తాండవ కృష్ణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పట్టపగలే కాంతులు..!



వివేకానందనగర్‌లో..

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీలో పట్టపగలే వీధి దీపాలు వెలుగులు జిమ్ముతున్నాయి. విద్యుత్‌ను ఆదా చేయాల్సిన అధికారులే విద్యుత్‌ను వృథా చేయటం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది వివేకానంద నగర్‌లో వెలుగుతున్న వీధి లైట్లకు ఆన్ ఆఫ్ స్విచ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదే విధంగా వెలగని వీధి లైట్ల స్థానంలో కొత్త వీధి లైట్లు వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం



మోతీనగర్: యజ్ఞహోమాలతో శాంతి సౌభాగ్యాలు కలుగుతాయని శృంగేరి శారద శంకరమఠం మోతీనగర్ శాఖ కార్యనిర్వహణ అధికారి సీఎస్ఆర్ మూర్తి పేర్కొన్నారు. శంకరమఠం వార్షికోత్సవంలో భాగంగా సోమవారం రుద్ర హోమం నిర్వహించారు. ఈ వేడుకలు ఈనెల 30వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మన సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించాలి



బాల సంస్కార్ శిక్షణ కేంద్రంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ కొండలరావు, బీజేపీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రామాలయంలో బాల సంస్కార శిక్షా కేంద్రం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. హిందువులు ప్రతి రోజు పఠించాల్సిన శ్లోకాలను ఈ శిబిరంలో పిల్లలకు నేర్పిస్తారు. ఈ సేవా భారతి కార్యక్రమాన్ని ఆంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో సరస్వతి, స్వర్ణలక్ష్మి, రజనీ, హరీష్ నిర్వహించారు. ఈ శిబిరంలో మొదటి వారంలోనే సుమారు 80 మంది చిన్నారులు పాల్గొన్నారు. ప్రతి రోజు శ్లోకాలతో పాటు ఆటలు, కథలు, నేర్పుతారు. వారాంతంలో స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్రలు, నీతి కథలు పిల్లలకు చెబుతారు.

- ఆల్విన్‌కాలనీలోని శిశుమందిర్‌లో 15 మంది పిల్లలతో రెండో బ్యాచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్వర్ణలక్ష్మి, నందినిలు సహకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిభ చూపిన చిన్నారులకు ఆర్ఎస్ఎస్ నగర సంఘ్ చాలక్, కొండలరావు, బీజేపీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్‌లు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎస్‌బీఐ మేనేజర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ... పిల్లలు, పెద్దలు అందరూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించాలని కోరారు.

పిట్టంపల్లి రామలింగాచారికి విశ్వకర్మ లెజెండరీ అవార్డు




అవార్డును అందుకుంటున్న అయోధ్య రామయ్య పాదుకలు చేసిన లోహశిల్పి రామలింగాచారి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో విశ్వకర్మలు అందిస్తున్న సేవలకు అవార్డులను ప్రదానం చేయడం హర్షణీయమని విశ్వకర్మ లెజెండరీ అవార్డు గ్రహీత, అయోధ్య రామయ్య పాదుకల శిల్పి పిట్టంపల్లి రామలింగాచారి అన్నారు. సుందరయ్య కళానిలయంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో 58 మందిని అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, పద్మశ్రీ అవార్డు గ్రహీత వేలు ఆనందాచారి హాజరై వారికి విశ్వకర్మ లెజెండరీ అవార్డులను ప్రదానం చేశారు.

- ఈ సందర్భంగా పిట్టంపల్లి రామలింగాచారి మట్లాడుతూ... విశ్వకర్మలు తమ కళను సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో సేవలు అందిస్తున్నారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి అవార్డులతో సత్కరించుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఇలాంటి అవార్డులు, సత్కారాలు అందుకునే విశ్వకర్మ కళాకారులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారన్నారు. కళాకారులను ప్రోత్సహిస్తున్న శ్వకర్మ నాలెడ్జ్ సెంటర్‌కు అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ అధ్యక్షుడు పుష్పగిరి, రచయిత్రి దాసోజ్ లలితా, కళిదాసు, లక్ష్మీనారాయణ, నీలిమ, వెంకటరమణ, వినోద్, నీలిమా, అంజన్న, గణేష్‌బాబు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలోని ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు తులసినగర్ రోడ్డు నెంబర్ 1, 2, హెచ్ఎంటీహిల్స్ వాటర్ టాంక్ లైన్, జలవాయు విహార్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో...

మూసాపేట: బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బాలాజీనగర్, కూకట్‌పల్లి మెయిన్‌రోడ్డు.

- అదే విధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇందూ విల్లాస్, ఇందు అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రేపటి నుంచి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

మోతీనగర్: కబీర్‌నగర్‌లోని శివరామాంజనేయస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాలను మే 29 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ ఉదయం 7గంటలకు ఉత్సవ ఆరాంభ స్తపనం, సాయంత్రం 6గంటలకు గణపతి పూజ, రక్షాబంధనం, ఉత్సవ ప్రారంభం, జూన్ 1వ తేదీ హనుమాన్ జయంతి సందర్భంగా హనుమంతుడికి అభిషేకం, విశేష అర్చనలు, పరమేశ్వరునికి మహా రుద్రాభిషేకం, బిల్వార్చన, రుద్ర హోమం, మహా పూర్ణాహుతి రాత్రి 7 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఉంటుందన్నారు. భక్తులంతా ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని భవ్యాస్ తులసీవనంలో భూసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం మోహినీ పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. అన్నకూటోత్సవం, ఊంజల్ సేవ, శ్రీవారి గరుడ మహోత్సవం కనుల పండువగా చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి దేవదేవుడిని వీక్షించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనిల్‌రెడ్డి, ఆనంద్‌ప్రసాద్, ఎంఆర్‌కే రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- **28, 29వ తేదీన కార్యక్రమాలు..**

స్వామివారి రథోత్సవం సాయంత్రం శ్రీవారి శాంతి కల్యాణ మహోత్సవం, ముత్యాల పందిరి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 29వ తేదీన వసంతోత్సవం, శ్రీవారి చక్రస్నానం, సాయంత్రం తిరువీధుల యందు అష్టవాహనోత్సవం, ధ్వజారోహణ, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలోని ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ ఒక్కొక్క గ్రూపులో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో మొత్తం 160సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బాలికలు ఉచిత హాస్టల్ వసతికి అర్హులని తెలిపారు.

రమాబాయి అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

డాక్టర్ మల్లు ప్రతిభారమేష్

మూసాపేట: గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాతా రమాబాయి అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ దళిత నాయకుడు మల్లు రమేష్, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మల్లు ప్రతిభ విచ్చేసి రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం, హక్కుల కోసం తన కుటుంబాన్ని త్యాగం చేసిన గొప్ప త్యాగమూర్తి రమాబాయి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కర్క పెంటయ్య, కాదారం వినయ్ కుమార్, శారదారెడ్డి, కర్క డాకయ్య, భాశెట్టి నర్సింగరావు, వినయ్‌కుమార్, కర్క శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లు రమేష్, డా. మల్లు ప్రతిభ, కర్క నాగరాజు

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

మల్కాజిగిరి ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

- హోలీమేరీ కాలేజీలో ఐదు నియోజకవర్గాల కౌంటింగ్
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్‌బీనగర్, వెస్లీ కాలేజీలో కంటోన్మెంట్

సాక్షి,మేడ్చల్ జిల్లా: వచ్చే 4వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ ఏఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో మేడ్చల్, మల్కాజిగిరి, త్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్‌బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఏఆర్వోలతో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని గౌతమ్ అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన చర్యలపై ఏఆర్వోలకు ఆయన పలు సూచనలు చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి 28 టేబుళ్లు, మల్కాజిగిరి 20, కుత్బుల్లాపూర్ 28, కూకట్‌పల్లి 20, ఉప్పల్ 20, ఎల్‌బీనగర్ 28, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 20 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

హోలీమేరీ కాలేజీలో ఐదు

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కీసర మండలంలోని భోగారం హోలీమేరీ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్బీనగర్, వెస్లీ కాలేజీలో సికింద్రాబాద్ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ నిర్వహిస్తామని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ మాత్రం హోలీమేరీ కాలేజీలో నిర్వహిస్తామన్నారు. ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాల్లో టేబుల్స్, సీసీ కెమెరాలు, విద్యుత్, ఇంటర్నెట్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బందికి టీ, స్నాక్స్, భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్ రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, ఏడు నియోజకవర్గాల ఏఆర్వోలు, ఎలక్షన్ సెల్ విభాగం అధికారి రాజేశ్వర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



'హోలీమేరీ'లో ఏర్పాట్ల పరిశీలన

సాక్షి,మేడ్చల్ జిల్లా: భోగారం హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించ తలపెట్టిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను సోమవారం ఎన్నికల అధికారి గౌతమ్, రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్‌జోషితో కలిసి పర్యవేక్షించారు. లోక్‌సభ పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ఏర్పాట్లకు అవసరమైన పలు సూచనలు, సలహాలను సంబంధిత అధికారులకు తెలిపారు. ప్రతీ కౌంటింగ్ సెంటర్‌లో సీసీ కెమెరా, కరెంటు, ఇంటర్నెట్, మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ పద్మజ, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.